# రేపటి సూర్యోదయం

## పి.ఎస్.నారాయణ కథలు



# రేపటి సూర్యోదయం

## పి.ఎస్.నారాయణ కథలు

(నాలుగో సంపుటం)

**మీడియా హౌస్ పబ్లికేషన్స్**

హైదరాబాదు

2010

**Repati Suryodayam**
Anthology of short stories

By
**P.S.Narayana**
© author
First Edition: **January, 2010**

Cover Design : **Kumar**

Printed & Published by
**Media House Publications**
304, Sridatta Homes
Bagh Amberpet
Hyderabad - 500 013

Printed at :
**Akruthi Offset Printers,**
H.No.1-1-191/A, Chikkadapally
Hyderabd - 500 020
☎ : 040-27664525

For Copies:
**P.S. Narayana**
8-3-168/20/B/7,
Siddartha Nagar (North),
Hyderabd - 500 038.
☎ : 040-23713835 : 919948319407

**Media House Publications,**
Hyderabad- 500 013.

**Visalandhra Book House,**
Bank Street, Hderabad-500 001

**Navodaya Book House,**
Kachiguda, Hyderabad-500 027

Price: **Rs.100/- (us $ 8)**

# ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | పోస్ట్‌మార్టమ్ | 11 |
| 2. | చిలిపి కిరణం | 21 |
| 3. | రేపటి సూర్యోదయం | 30 |
| 4. | అంతస్సు | 62 |
| 5. | అది పీటముడి | 79 |
| 6. | మల్లెలు మధురక్షణాలు | 88 |
| 7. | ఒక్కమాట | 97 |
| 8. | మనోదృశ్యం | 109 |
| 9. | గొడుగు నీడ | 126 |
| 10. | అనుబంధం | 142 |
| 11. | నమ్మకం | 155 |
| 12. | పునీత | 168 |
| 13. | ఎంచుకున్న దారి | 177 |
| 14. | నిన్నటి మెరుపు- రేపటి నక్షత్రం | 181 |
| 15. | పచ్చని ఆకులు రెండు | 191 |

# పోస్ట్ మార్టమ్

''The living need charity more than the dead''

- GEORGE ARNOLD.

మనకు తెలియకుండానే మహా వేగంగా పరుగెడుతున్న సూర్యుడు ఆ ఊరి బండల్ని ముక్కలు చేస్తున్నాడు. ఆయన చూపుల్ని తట్టుకోలేనట్లుగా పక్షులు సగం కళ్ళు తెరుచుకొని చెట్ల కొమ్మల మధ్య ముఖాలు వేలాడేస్తున్నాయి నీరసంగా.

ప్రపంచంలో వున్న రోగాలన్నీ అక్కడే పేరుకు పోయినయ్యా అన్నట్లుగా కంపుకొడుతున్న ఆ ఆవరణ, పెచ్చులు ఊడిన గోడలతో– భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందు– గానుగ సున్నంతో కట్టిన డాబా... దాని చుట్టూ దానికి వత్తాసుగా తరువాత తరువాత కట్టిన బెంగుళూరు పెంకు వసారాలతో గాలీ వెలుతురు సరిగ్గా రాని గదులు...

ఆ గదులలో ఇనుప మంచాలు... వాటిమీద రంగువెలిసిన దుప్పట్లు కప్పుకున్న పాత కొబ్బరిపీచు పరుపులు... అదే అతి ఖరీదైన ఆసుపత్రి అనుకుంటున్నట్లు భవిష్యత్తు మీద ఆశను కళ్ళల్లో కదిలించుకుంటూ రోజులు వెళ్ళదీస్తున్న రోగులు.

లోపల ఇమడలేక బయట వరండాలల్లో తారట్లాడుతున్న రోగుల తాలూకు మనుష్యులు.

ఆ ఆసుపత్రి భవంతికి ముందుగా నాలుగు గోడల నడుమ వచ్చే జనానికి ఇంత నీడనిచ్చే మహావృక్షం– అలసి సొలసి ఆకులు రాలుస్తున్న దశలో ఉన్నది.

దానికింద వీరంగం వేస్తున్న జనం. వాళ్ళ గొంతులను తడుపుతూ బయట బండ్లమీద నుంచి లోపలకు వచ్చి "ఛుక్...ఛుక్" మంటున్న సోడా సీసాలు.

ఆ పాతింటి హాలు మధ్యలో స్పష్టంగా మరకలు కనబడుతున్న గుడ్డ పరిచిన టేబుల్ వెనుక కుర్చీలో కూర్చొని వున్నాడు కొత్తగా ఆ ఆసుపత్రికి వచ్చిన కుర్ర డాక్టరు.

అతడి చుట్టూ పాతికమంది జనం నిల్చున్నారు. వాళ్ళ చేతుల్లో కత్తులు లేకపోయినా మాటల్లో మంచి పదును ఉన్నది. తెగ అరుస్తున్నారు. రొప్పుతున్నారు. ఆగి అరుస్తున్నారు.

"నన్నేం చేయమంటారు చెప్పండి... నేనూ కొత్తగా వచ్చాను... ముగ్గురు డాక్టర్లు ఉండవలసిన ఈ ఆసుపత్రిలో నేనొక్కడినే వున్నాను ఇప్పుడు... మా సీనియర్ కోసం కబురు పంపాను గదా... వస్తాడు... రాగానే పోస్ట్‌మార్టమ్ జరుగుతుంది... అది జరిగిన వెంటనే మీకు బాడీని అప్పగిస్తాం! ఆలస్యం అవుతుంవీ అంటే– అవుతుంది మరి– తప్పదు!"

"అలా వీల్లేదు సారు! మా లీడర్ రమేశం బాడీని అరగంటలో మాకిచ్చేయాలి– అంతే! మీరేం చేస్తారో చేయండి!"

కుర్ర డాక్టరుకు ఎదురుగ్గా కూర్చున్న ఇనస్పెక్టరు వాళ్ళనూ డాక్టరునూ మార్చి మార్చి చూస్తున్నాడు.

"ఆగండయ్యా మీరు... ఊరికినే ప్రతిదానికీ గోల... మనిషిని పంపించటం మీరు చూశారు గదా!" అరిచాడు ఇనస్పెక్టర్ కంఠం హెచ్చించి– అతగాడికి ఎప్పటికైనా వాళ్ళతోపాటే డాక్టరుతోటీ ఎక్కువ అవసరం వుంటుంది.

"ఆ డాక్టరు ఎప్పుడొస్తాడో ఏమిటో... ఈయనా డాక్టరే గదా సారూ... పోస్ట్‌మార్టం చేస్తే మేం బాడీని తీసుకు వెళ్ళిపోతాం... చెప్పాంగదా మా ప్రాబ్లం... మన జిల్లా మినిస్టరుగారు మన ఊరి మీదగా వెళుతున్నారు... ఆయన ఓ గంటలో ఇక్కడ వుంటానన్నారు... ఇక్కడనుంచి మేం బాడీని తీసుకువెళ్ళాలా... పాడె కట్టాలా... ప్రొసెషన్ తీయాలా... మా లీడర్ని తగలేసేటప్పుడు మినిస్టరుగారు గూడా వచ్చారూ అంటే మాకూ, మా చచ్చిన లీడరుకూ ఎంత గౌరవంగా వుంటుందో మీరు ఆలోచించండి... చూస్తూ చూస్తూ ఇలాంటి ఛాన్సును ఇక్కడ డాక్టరు లేదని ఎలా వదులుకుంటాం!"

ఇనస్పెక్టరుకూ ఆ పరిస్థితి ఇబ్బందిగానే వున్నది.

"అదికాదు సారు! ఇందులో మా లీడర్ని కోసి చూడాల్సిన పనేమున్నది... ఆ వెంకటేశుగాడి మనుష్యులు మా వాడిని నలుగురూ చూస్తుండగా నడిరోడ్డు మీద కత్తులతో పొడిచేశారు... అది అందరూ చూసిందే... ఇంకా మళ్ళీ మీరు చూసేదేమిటి?... అదే రాసి మా బాడీ మాకిచ్చేయండి!"

"అలా వీలుకాదయ్యా! ఇది పోలీసు కేసు... పోస్ట్‌మార్టం జరగకుండా బాడీ ఇచ్చే ప్రసక్తేలేదు!" అన్నాడు కుర్ర డాక్టరు మొండిగా.

"అదేం మాకు తెలియదు సార్! మా లీడర్ని మినిస్టరుగారి ముందు తగలేయాల్సిందే... అలా కాదూ అని మా వాడికి అవమానం జరిగిందా ఇక్కడ ఇంకా కొన్ని శవాలు లేస్తయి!" అన్నాడు అతడు ఆవేశంతో దురుసుగా.

అతడు రౌడీ లీడర్ రమేశంకు లెఫ్టినెంట్... గురువుగారు చచ్చారు కాబట్టి ఆ ప్రియతమ శిష్యుడే ఇక ఆ రథానికి పగ్గాలు పట్టుకోవాలిసింది... ఇంత మంచి అవకాశం అతడికి మరోసారి రావడం కష్టం... ఎట్లాగయినా సరే మినిస్టరుగారి ముందు తన లీడర్ని, గురువుని తగలేసి కీర్తిని కొట్టేయాలని అతడి ఆశ!

ఒక్కసారిగా జనమంతా ఘొల్లున అరిచారు.

"మా లీడరు శవాన్ని మాకు అప్పగించాలి!"

"లీడరు రమేశం జిందాబాద్!"

ఇనస్పెక్టర్ అరిచాడు లేచి టోపి పెట్టుకొని చేతిలోకి లాఠీ తీసుకుంటూ. "అంతా ముందు బయట కెళ్ళండి... నేను చూస్తాను గదా మినిస్టరుగారు వచ్చేలోగా బాడీనిచ్చే ఏర్పాట్లు... గోల చేయవద్దు ఇక్కడ... ఊఁ... నడవండి!" లాఠీ ఊపటం మొదలు పెట్టాడు.

అందరూ గొణుక్కుంటూ బయటకు వెళ్ళారు. ఖాకీ డ్రస్సు ఖాకీ డ్రస్సే... ఆయనగారి చేతిలో లాఠీ లాఠీనే... వాటి పవరు వాటిది!

అందరూ బయటకు వెళ్ళిన తరువాత ఇనస్పెక్టరు డాక్టరుతో అన్నాడు. "ఇదంతా రౌడీ గ్యాంగు... ఇప్పుడు మీరు కాదూ గూడదూ అంటే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ అవుతుంది... మీరే ఏదో విధంగా ఆ ఫార్మాలటీస్ పూర్తి చేసి వాళ్ళ మొహాన ఆ బాడీని పారేయండి... స్టేషన్‌లో కానిస్టేబుళ్ళు గూడా చాలా మంది పండక్కి ఊళ్ళకెళ్ళారు... తరువాత ఏమన్నా అయిందంటే మనిద్దరం ఇబ్బందుల్లో పడతాం!"

మిగిలిన యిద్దరు డాక్టర్లలో ఒకాయన శెలవు పెట్టి మరదలు పెళ్ళికి అత్తగారింటికి వెళ్ళాడు. రెండో ఆయన భార్యకు పురిటి నొప్పులొస్తుంటే పక్క టౌన్‌లో ప్రైవేటు నర్సింగ్ హోంలో జేర్చటానికి తీసుకు వెళ్ళాడు. ఆయన కోసమే ఇప్పుడు కబురు వెళ్ళింది. ఆయన ఎప్పుడొస్తాడో తెలియదు. ఆమెకు డెలివరీ అయిందో లేదో తెలియదు!

"ఇంతకు ముందు మీరు ఒకటి రెండు పోస్ట్‌మార్టమ్‌లు పక్కనే వుండి చూచారు గదా... ఆలా కానిచ్చేయండి పీడా పోతుంది!" ఇనస్పెక్టర్ కదులుతూ డాక్టర్ చేత "ఊఁ" అనిపించాడు.

కుర్రడాక్టరు అనాసక్తితో లేచాడు. మేల్ నర్సింగ్ ఆర్డర్లీని పిలిచాడు. వార్డ్‌బాయ్‌ని పిలిచాడు. స్వీపర్‌ని పిలిచాడు.

"వెళ్ళి ఆ శవాలు కోసే గది తలుపు తీసి... అంతా శుభ్రం చేయండి... తరువాత ఆ లీడర్ బాడీ తీసుకు వెళ్ళి టేబుల్‌మీద పడుకోబెట్టండి! స్టెరిలైజ్ చేసిన సిజర్స్ మిగతా ఇనుస్ట్రుమెంట్స్ వున్నాయిగదా!" అడిగాడు మేల్ నర్సింగ్ ఆర్డర్లీని.

"అన్నీ వున్నయి సార్ రెడీగా!" అంటూనే గొణుక్కున్నాడు– వెధవ చచ్చిన శవానికి స్టెరిలైజ్ చేసినవి దేనికి... బరబరా కోసి అవతల పారేయక!...

అతగాడు తన సర్వీసులో ఎన్నో పోస్ట్‌మార్టమ్‌లు చూచాడు. "పదండి సార్! పక్కన నేనుంటాగా... ఏం చేయాలో చెబుతాను!" అన్నాడు.

అది ఓ మండల కేంద్రం. చుట్టుప్రక్కల పది పల్లెలకు అదే పెద్ద పట్నం– అదే పెద్ద ఆసుపత్రి!

క్లర్కు తెచ్చి రిపోర్టు రాయాల్సిన ఫారాలు– చచ్చినవాడి పేరు, వయస్సు, ఊరు మొదలైన మామూలు విషయాలు అన్నీ రాసి డాక్టర్‌కు యిచ్చాడు.

డాక్టరు, ఇనస్పెక్టరు బయటకు వచ్చారు. చచ్చిన రౌడీ లీడరు రమేశం శిష్యులంతా సంతోషంగా– విజయం సాధించినట్లుగా జిందాబాదులు కొట్టారు. పెద్దగా విజిళ్ళు వేశారు.

"లీడర్ రమేశం వర్ధిల్లాలి!"

"లీడర్ రమేశం జిందాబాద్!"

"లీడర్ రమేశం అమర్ రహే!"

'– వాడు ఇప్పటికే పది మర్డర్లు, యిరవై రేపులు, పద్నాలుగు దొమ్మీలు చేశాడు... ఇంకా బ్రతికి వుంటే ఇంకెన్ని చేసేవాడో!' ఇనస్పెక్టర్ గొణుక్కుంటూ డాక్టర్‌తో పాటు నడుస్తున్నాడు వరండాలో. సరిగ్గా అప్పుడు ఓ డొక్కు సైకిల్ రిక్షా వచ్చి ఆ వరండా మెట్ల దగ్గర ఆగింది.

ఆ రిక్షాలో ఓ ముసలాడు వున్నాడు. చచ్చిన శవంలా బిగుసుకుపోయి పడివున్నాడు. నల్ల తుమ్మమొద్దులా వున్నాడు. ఎన్నాళ్ళ క్రితమో కత్తిరించుకున్న జుట్టంతా రేగి చెమటతో తడిసి ముఖమంతా ఆక్రమించుకున్నది. వంటిన చొక్కా లేకపోవడంతో పీక్కుపోయి ఎముకలు వెళ్ళుకొచ్చిన శరీరం నూనెలో వేగినట్లున్నది. ఆరడుగుల పైగావున్నాడు. వయస్సులో వున్న ఆడదాని నడుమంత ఛాతి– ఎగిరెగిరి పడుతోంది ఆయాసంతో.

ఆ రిక్షాను తోస్తున్నట్లుగా వెనకాలే దాని మీద చేయి వేసి పరుగెత్తుకుంటూ వచ్చిన వాడి ఆరునెలల క్రితం పెళ్ళయిన పదహారేళ్ళ కూతురు వున్నది.

ఆ మనిషి పేరు కోటయ్య. ఊరి బయట రామమందిరం ముందు మర్రిచెట్టు క్రింద చెప్పులు కుట్టుకుంటుంటాడు. అక్కడికి పది బారల దూరంలో వాడి గుడిసె.

"నా మొగుడు చస్తున్నాడు డాక్టరు బాబు!" అరిచింది రిక్షాలో ఆడమనిషి- ఒళ్ళో వున్న ఆ బిగుసుకుపోతున్న శరీరాన్ని పైకి లేపుతూ. కుర్ర డాక్టరు ఆమె ఏడుపు వింటూ ఆగి అడిగాడు. "ఏమైంది?"

"తెలియదు డాక్టరు బాబు! పాత చెప్పులు బాగు చేస్తూ గుండెల్లో నొప్పని వెనక్కు పడి పోయాడు... రిక్షాలో వేసుకొచ్చాం! చూడండి బాబు!" అంటూ మరోసారి గొంతు పెంచి ఏడ్వటం మొదలుపెట్టింది.

డాక్టరు మెట్టు దిగి, రిక్షా దగ్గరకు వెళ్ళి, అతడి చేయి పట్టుకు చూచాడు. నాడి నీరసంగా వున్నది. ప్రక్కనే వున్న మేల్ నర్సింగ్ ఆర్డర్లీతో, "లోపలకు తీసుకువెళ్ళి బెడ్ మీద పడుకోబెట్టండి!" అన్నాడు.

అతగాడు పెద్దగా అరిచాడు. "రిక్షా దిగి వాడిని పట్టుకు వెళ్ళి లోపల పడుకోబెట్టండి... ఇప్పుడే డాక్టరుగారు పది నిముషాలల్లో వస్తారు- తలుపు పక్కన ఖాళీ మంచం వుంది... ఏం కాదులే... మీరు పదండి డాక్టరుగారు!" అన్నాడు వినయంగా ఆయనవైపుకు తిరిగి.

కుర్ర డాక్టరు ఆ మాటలు విననట్లుగా, తల్లీ కూతురూ కలసి రిక్షాలోనుంచి దించుతున్న కోటయ్యనే చూస్తున్నాడు. "నువ్వెళ్ళి పట్టుకోరాదు... ఆడవాళ్ళు ఎక్కడ మోస్తారామనిషిని!" అన్నాడు కసురుకుంటూ.

మేల్ నర్సింగ్ ఆర్డర్లీ నసుక్కుంటూ రిక్షా దగ్గరకు వచ్చాడు. అంతలోనే చచ్చిన రౌడీలీడర్ అసిస్టెంటు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "సారూ! మినిస్టరుగారు అక్కడ బయల్దేరారట... గంటలో శ్మశానం దగ్గరకు సరాసరి వచ్చేస్తామన్నారు... ఇప్పుడే ఫోనొచ్చింది... మా లీడర్ బాడీని త్వరగా ఇచ్చేయండి!" అన్నాడు అరుస్తున్నట్లుగా.

కుర్ర డాక్టరు చికాగ్గా అతడి వంక చూచాడు.

"ఈ మనిషి చచ్చేటట్లున్నాడు... హార్ట్ ఎటాక్ వచ్చింది... కాసేపు ఆగండి!" అన్నాడు కసురుకుంటున్నట్లుగా.

అతడు రిక్షాలోనుంచి దించుతున్న కోటయ్యను చూస్తూనే ముఖం చిట్లించాడు. "ముసలాడు సారూ వాడు... వాడికేం కాదు... ముందు మీరు పదండి!" అన్నాడు డాక్టరు దగ్గరకల్లా వచ్చి.

"ఏమిటి గోల... ఉండండి... అతడిని పరీక్షచేసి మందులిచ్చి వస్తాను అంటుంటే పది నిముషాలు ఆగలేరా!" వెనక్కు తిరిగి అరుస్తూ అన్నాడు.

"వాడు చస్తే కొంపలేం అంటుకోవు సారు... వాడికి కళ్ళు కనబడక చెప్పులు గూడా సరిగ్గా కుట్టి చావటంలేదు... వాడుపోతే వాడి కొడుకున్నాడు ఆపని చేసేటందుకు... ఈ మినిస్టరు వెళ్ళిపోతే మా లీడర్ని తగలేసేటప్పుడు మరో మినిస్టరు వస్తాడా సారు! చెప్పింది వినండి!"

కోటయ్య భార్య ఏడుస్తూనే మసక బారిన కళ్ళతో ఆ అరుస్తున్న వాడి వంక చూచింది. చుట్టూ ఉన్న మనుష్యుల్ని చూచింది– వాళ్ళంతా ఎప్పుడో ఒకప్పుడు తన మొగుడి ముందు నిలబడి తెగిన చెప్పులు కుట్టించుకున్న వాళ్ళే!

ఆమె ఘొల్లుమన్నది వాళ్ళ మాటలు విని, ఆ డాక్టరు ఎక్కడ వెళ్ళిపోతాడోనన్నట్లుగా. "డాక్టరు బాబూ! మా ఆయన్ను రక్షించండి బాబూ!"

అసిస్టెంట్ లీడరు గంయ్‌న లేచాడు. "ఛ!ఛ!... తప్పుడు ముండ... నేను సారుతో మాట్లాడుతుంటే మధ్యలో నీదేందే గొడవ... వాడు చస్తే ఈ ఊరికిగాని, ఈ జిల్లాకుగాని, ఈ రాష్ట్రానికిగాని నష్టమేం లేదు... ముందు మా లీడరు శవాన్ని తీసుకు వెళ్ళాలి గాని కాసేపు నోరు మూసుకు కూర్చో!" అన్నాడు చేయెత్తి ఆ ఆడమనిషి నోటిమీద కొట్టబోతూ.

మేల్ నర్సింగ్ ఆర్డర్లీ వచ్చాడు. "వాడిని మంచం మీద పడుకోబెట్టాంగాని మీరు పదండి... వాడికేం కాదు... బాగానే వున్నాడు... నేనున్నానుగదా మీరు నడవండి!" అన్నాడు కుర్ర డాక్టర్ని నెడుతున్నంత పని చేస్తూ.

డాక్టరు ఇనస్పెక్టర్ వంక చూచాడు. ఆ ముసలాడి మంచంమీద పడి ఏడుస్తున్న ఆడవాళ్ళను చూచాడు. కత్తులు నూరుతున్నట్లున్న వందమంది రౌడీ మూకవంకా చూశాడు.

ఇనస్పెక్టర్ నిర్లిప్తంగా నవ్వి ఆకాశంలోకి చూశాడు... ఏ మబ్బుల వెనకనైనా దేవుడున్నాడేమో వచ్చి డాక్టరుకు సర్ది చెబుతాడన్నట్లుగా.

చిన్న లీడరు చెట్టుమీద ఎండకు వగరుస్తున్న పక్షులన్నీ లేచేటట్లుగా అరుస్తునే వున్నాడు. "అరేయ్! ఆ పాడెను ఇక్కడికే పట్టుకు రండ్రిరా... టైం లేదు... మినిస్టరు గారు వచ్చారంటే పదినిమిషాలకు మించి వుండరు... శవాన్ని ఇటునుంచి ఇటే శ్మశానానికి తీసుకు వెళ్దాం!"

"రమేశం లీడర్ జిందాబాద్!" వంద గొంతుకలు ఒకేసారి నోరు తెరిచినయ్.

కంపు కొడుతున్న రేకుల షెడ్డులో కాలుపెట్టాడు కుర్ర డాక్టరు. నోరూ, ముక్కూ, చెవులూ మూసుకున్నట్లుగా ఓ తెల్లగుడ్డ కట్టుకున్నాడు. చేతులకు ఈ పాపం అంటుకోగూడదు అన్నట్లుగా గ్లౌస్ తొడుక్కున్నాడు. కళ్ళకు ఈ గాలి సోకగూడదు అన్నట్లుగా అద్దాలు పెట్టుకున్నాడు. నెత్తిన జుట్టును- చేస్తున్న ఈ పాపానికి ఎవరైనా పీకేస్తారేమో నన్నట్లుగా ఓ గుడ్డ టోపీ పెట్టుకున్నాడు.

అరగంట తరువాత బయటకు వచ్చి అవన్నీ పీకి అవతల పారేశాడు. ఆయన వెనగ్గానే హడావుడిగా తెల్లగుడ్డల్లో చుట్టివేసివున్న రౌడీ లీడర్ రమేశం శవం బయటకు వచ్చింది.

మరోసారి చచ్చిన అతగాడి శిష్యుల ఆనందపు కేకల శబ్దం, కంపుకొడుతున్న ఫినాయిల్ వాసనలా, ఆ ఆవరణ నంతా ఆవరించింది.

రాసిన పోస్ట్‌మార్టమ్ రిపోర్టును కుర్చీలో కూర్చొని ఒకసారి చదువుకున్నాడు కుర్ర డాక్టరు.

''మొత్తం శరీరం మీద యిరవైనాలుగు కత్తిపోట్లు వున్నాయి. అన్నీ రెండంగుళాలనుంచి ఆరంగుళాల లోతు వున్నాయి. రెండు- మూడు లీటర్ల రక్తం ఆ గాయాల నుండి పోయి వుంటుంది. గుండెలో గుచ్చుకున్న ఆరంగుళాల లోతు కత్తిపోటే ప్రాణం పోవటానికి ప్రధాన కారణం. మనిషి త్రాగిలేడు. శరీరంలో ఎక్కడా విషపదార్థం సోకలేదు. ఇప్పటికి మూడు- నాలుగు గంటలమధ్య ప్రాణం పోయింది. ఎడమకాలి మడమ దగ్గర రాతి దెబ్బతగిలి ఎముక విరిగింది.” గడియారం చూచుకుంటూ సమయం నోట్‌చేసి, సంతకం పెట్టేశాడు డాక్టరు ఆ రిపోర్టుమీద.

“సారు! వెంకటేశం గాడి మనుష్యులు పొడిచేశారని ఆ రిపోర్టులో రాయండి!” అన్నాడు చిన్న లీడరు ఎదురుగ్గా నిల్చొని.

“అది నాకు తెలియదు... నా పరిధిలోకి రాదు... ఇనస్పెక్టరుగారు ఆయన రిపోర్టులో రాసుకోవాలి అది!”

“అది అందరూ చూసిందే గదా సారు! మేం ఏమీ అబద్ధం రాయమనటం లేదు... ఇట్లా అయితే కష్టం సారూ పనిచేయటం!”

ఇనస్పెక్టర్ ఒక్క అరుపు అరిచాడు. “మాట్లాడకుండా వెళ్ళిపోండి ఇక్కడనుంచి... పోస్ట్‌మార్టం వెంటనే చేయమని అడిగారు- ఆయన చేశారు... సంతోషించక ఇంకా గోలేమిటి... ఊఁ... నడవండి!”

చెట్ల మీద పక్షులు మరోసారి లేచినయి అరుస్తూ.

గోల... అరుపులు... కేకలు...

గేటు దగ్గర ఏడుకట్ల సవారీ, లీడర్ రమేశాన్ని ఆహ్వానిస్తూ రెడీగా వున్నది.

జనం అటు తిరగ్గానే విసురుగా కోటయ్య పడుకున్న బెడ్ దగ్గరకు వడివడిగా అడుగులు వేశాడు కుర్ర డాక్టరు. ఆ మంచం మీద కోటయ్య బిగుసుకు పడుకున్నాడు, కళ్ళు తెరుచుకుని రెప్పలార్పకుండా, ఏడుస్తున్న పెళ్ళాం వంకే చూస్తూ.

డాక్టరును చూస్తూనే ఆ ఆడవాళ్ళిద్దరూ మరోసారి ఘొల్లుమన్నారు. మేల్ నర్సింగ్ ఆర్డర్లీ వచ్చి వాళ్ళిద్దరినీ అక్కడ నుంచి వెళ్ళమని పెద్దగా ఒక్క అరుపు అరిచాడు.

డాక్టరు చేయిపట్టుకు చూచాడు కోటయ్యది. ఉలిక్కిపడ్డట్లుగా గుండెమీద చేయి వేశాడు. స్టెతస్కోప్‌ను చెవులకు తగిలించుకొని వడివడిగా పరీక్షించాడు.

కోటయ్య ప్రాణం అప్పటికే అనంత వాయువుల్లో కలిసి పోయింది. అరచేత్తో అతడి రెండు కనురెప్పలను మూసేశాడు– బాధగా, జాలిగా ఆ కట్టె శరీరపు ముఖంలోకి చూస్తూ.

కుర్ర డాక్టరుకు రెప్పలు వాలిపోయినయి. వెనక్కు తిరిగాడు నీరసంగా. పక్కనేవున్న మేల్ నర్సింగ్ ఆర్డర్లీతో, “శవాన్ని తీసుకు వెళ్ళమని చెప్పు!” అన్నాడు.

అతడు చిన్నగా నవ్వి, “నేను ఇందాకనే అనుకున్నాను సార్!... వాడు ఎక్కువ సేపు బ్రతకడని!” అన్నాడు.

చిరాగ్గా అతడి వంక చూశాడు డాక్టరు. ఆ చూపుకు అతడు ముఖాన్ని ముడుచుకొని పక్కకు తిప్పుకున్నాడు. డాక్టరు గుండె ఆతడి చావుకు తడిసి మూలిగింది.

‘వెంటనే అటెండ్ అయివున్నట్లయితే బ్రతికేవాడేమో పాపం!’ కళ్ళు తడవటం మొదలు పెట్టినయి కొత్తగా ఆ ఉద్యోగంలో జేరిన కుర్ర డాక్టరుకు.

తన గదిలోకి వచ్చి సీట్లో తల వంచుకు కూర్చున్నాడు తప్పు చేసిన వాడిలా. సర్వీసులో జేరింతరువాత మొట్టమొదటి సారిగా అనిపించింది– అతడికి– తన చుట్టూ ప్రపంచం కలుషితమయి ఎంతగా కంపుకొడుతున్నదా అని!

వార్డులో ఆ ఇద్దరి ఆడవాళ్ళ ఏడుపులను చూస్తూ మిగతా లేవగలిగిన రోగులు, రోగుల తాలూకు మనుష్యులూ వాళ్ళ చుట్టూ జేరారు, గుసగుసగా మాట్లాడుకుంటూ. తరువాత పావుగంటకు చచ్చిన కోటయ్య కొడుకు కాబోలు నాలుగు చక్రాల బండిని నెట్టుకుంటూ వస్తున్నాడు– శవాన్ని తీసుకు వెళ్ళేటందుకు.

ఆకులు రాల్చి రాల్చి ఎండిన కొమ్మల మధ్య నుంచి సూర్య కిరణాలు దూసుకు వస్తున్నయి పాపుల్ని దొరికితే మాడ్చి మసిచేయాలి అన్నట్లుగా–

కుర్ర డాక్టరు అంతరంగమంతా ఆవేదనతో నిండిపోయింది– బిగుసుకు పోయిన కళ్ళు తెరిచి చూస్తున్న కోటయ్య కట్టె ముఖం క్షణక్షణం కళ్ళముందు కదలాడుతుండగా.

అలాగే నిర్వేదంగా చూస్తూ శూన్యంలో దారులు వెతక ప్రయత్నిస్తున్నాడు అతడు. ఆవేశమొస్తున్నది. కోప మొస్తున్నది. రౌడీ మూకల మీద మంట ఎర్రగా రగులు తున్నది గుండెలు కాలేలా.

విసురుగా కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు శరీరమంతా సెగలు పొగలై ఆవిర్లు తేలుతుండగా.

మేల్ నర్సింగ్ ఆర్డర్లీను పేరు పెట్టే పెద్దగా పిలిచాడు. అతడు దగ్గరకు వస్తుండగానే, "బాడీని అప్పుడే వాళ్ళకు యివ్వవద్దు. పోస్ట్‌మార్టం చేయాలి!" అన్నాడు ఆవేశంగా.

మేల్ నర్సింగ్ ఆర్డర్లీ కుర్ర డాక్టర్ వంక విస్మయంగా చూచాడు. "కోటయ్య గుండె ఆగి చచ్చాడు సార్! అది హత్య కాదు... యాక్సిడెంట్ కాదు... ఇంకా పోస్ట్‌మార్టమ్ దేనికండీ!" అని తెరిచిన నోటిని అలాగే వుంచి డాక్టరును చూస్తూ వుండిపోయాడు.

"చెప్పింది చేయ్!" ఒక్క అరుపు అరిచాడు డాక్టరు.

గూడలెగరేశాడు అతడు. తలెగరేశాడు. కళ్ళు చికిలించి చూస్తూ, 'ఈ కొత్తగా వచ్చిన డాక్టర్లకు ఏమీ తెలిసి చావదు... తెలిసిన వాళ్ళు చెబితే వినే గుణం వుండదు... మొండి ఘటాలు!' అని అనుకుంటూనే, "కత్తులూ, కతార్లు స్టెరిలైజ్ చేయించమంటారా?" అని ఎగతాళిగా అడిగాడు.

డాక్టరు గుడ్లురిమి చూచాడు అతడి వంక. ఆ చూపుకు అతడు క్షణంలో మాయమయ్యాడు అక్కడ నుండి.

తరువాత పది నిమిషాలకు తిరిగి వచ్చి, "వాడి ఆడవాళ్ళు తిడుతున్నారు సార్ మిమ్మల్ని... అయినా నచ్చచెప్పి తీసుకు వెళ్ళి టేబుల్ మీద పడేశాం శవాన్ని!... ఇక మీ పని కానివ్వండి... పదండి!" అన్నాడు చిరాగ్గా.

'ఇంతవరకూ అక్కడ పనిచేసే ఏ డాక్టర్ అయినా తన మాటే వేదంగా పాటిస్తున్నాడు... వీడెక్కడ... నిన్నగాక మొన్న ఉద్యోగంలో చేరాడు. ప్రతిదీ ఎడ్డెమంటే తెడ్డెమే... చెప్పింది వినడు... పైగా చిరాకు'– అనుకున్నాడు మనస్సులోనే విసుగ్గా.

కుర్ర డాక్టరు బిగుసుకుపోయిన శవాన్ని పడుకోబెట్టిన రేకుల షెడ్డు వైపుకు నడిచాడు. వెనగ్గా మేల్ నర్సింగ్ ఆర్డర్లీ... స్వీపరు... వార్డు బాయ్... తెరిచి వున్న తలుపు గుండా లోపల కాలు పెట్టాడు.

చేతికి గ్లౌస్ లేవు. నోటికి ముక్కుకి అడ్డంగా గుడ్డ లేదు. నిక్క బొడుచుకున్న జుట్టుకు గుడ్డ టోపీ లేదు. ఆ శవాన్ని సూటిగా చూడలేక తప్పు చేసిన వాడిలా కళ్ళకు జోడు మాత్రం పెట్టుకున్నాడు.

శవం పక్కగా నిల్చొని చచ్చిన అతడి మీద గుడ్డ తీసి– బిగుసుకుపోయి, ముఖమంతా వికృతంగా ఆవరించిన జుట్టుతో వున్న ఆ మొహాన్ని చూచి– మళ్ళీ చటుక్కున గుడ్డ కప్పేశాడు.

కళ్ళు మూసుకు తెరిచాడు తడుస్తుండగా.

ఇంకా అక్కడ ఒక్క క్షణం గూడా వుండలేనట్లుగా వడివడిగా అడుగులు వేసుకుంటూ తన గదిలోకి వచ్చేశాడు.

క్లర్కును పిలిచి పోస్ట్‌మార్టమ్ ఫారాలు తెప్పించి అన్నీ పూర్తి చేసి చివరకు ఇలా రాశాడు.

'చచ్చిన కోటయ్య శరీరం మీద గాయం కాకుండా వంద కత్తులు వళ్ళంతా దిగబడి లోలోపలే గాయాలు చేయటంతో శరీరంలోని రక్తం బయటకు రావటానికి దారిలేక గడ్డ కట్టుకు పోయింది. గుండె ఆగిపోయింది.

ఈవిషయం నా పరిధిలోకి రాకపోయినా– ఈ హత్య నా కళ్ళముందే జరగడంతో నేను రాయవలసి వస్తోంది– కోటయ్యను చంపింది రౌడీ లీడరు రమేశం శవం!'

గడియారం చూచి టైం వేసి సంతకం పెడుతుండగా వాకిట్లో కారు ఆగిన చప్పుడయింది.

తలెత్తితే అందులోనుంచి సీనియర్ డాక్టరు దిగుతూ కనబడ్డాడు.

"అబ్బాయి పుట్టాడయ్యా! వెరీ నార్మల్ డెలివరీ!" అంటూ హుషారుగా లోపలకు వచ్చాడు.

అతడి చేతిలో స్వీట్ ప్యాకెట్ వున్నది!

*(శ్రీలేఖ మాసపత్రిక: ఏప్రియల్, 2002)*

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Repati+Suryodayam

* * *